

# లక్ష్యం - లక్షణం

వెయిట్ లిఫ్టింగ్‌లో గెలిచినవాడి దగ్గరికి వెళ్ళి 'అయ్యో పాపం! అంత బరువెలా మోశావ్'? అంటే అతనిక్కలిగే వీరావేశం వంటిది కలిగింది ఆయనకి.

''నన్ను చూస్తే నీకు జాలి ఎందుక్కలుగుతోంద బ్బాయ్?'' కోపంగా అడిగాడు.

''నా ప్రతిపాదనని సమస్యగా మార్చారు. ఆ సమస్యని చూపి నన్ను భయపెట్టాలనుకుంటున్నారు. అందుకు'' అన్నాను.

''అంటే మీవాళ్ళని నేనే రెచ్చగొట్టాననంటావ్''

''ఓ రకంగా అలాఅనే చెప్పుకోవచ్చు. ఐతే అది పైకి కనబడే కారణం. అసలు విషయం ఏమంటేమీ వాక్చాతుర్యంతో నా నిర్ణయాన్ని తప్పని నా వాళ్ళముందే నన్ను ఒప్పించడం'' రాఘవరావు దెబ్బతిన్నట్టు ఓ క్షణం చూసి 'పోనీ అలాగే అలాగే అనుకో, నీ నిర్ణయంలోని లొసుగులు ఏంటో నీకు తెలియాలికదా' తెలివిగా అడిగాడు.

''ఇప్పుడు మీరు చెప్పిన విషయాలన్నీ నేను మొదట్లోనే ఆలోచించి వాటి ఫలితాలనూ, పరిణామాలనూ అనుభవించడానికి సిద్ధపడినవే. ఇందులో మీరు కొత్తగా చెప్పింది ఏమీలేదు'' విసుక్కున్నాను. ఆయన వెంటనే లేచి నిల్చుని మీ ఇంటికి వచ్చి నీకు సలహా ఇవ్వడం పొరపాటే. సారీ'' అని వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళాక నాన్న నన్ను కేకలేశారు. ''ఏంటీ పెద్దా చిన్నాలేకుండా ఆయనతో వాదం'' అంటూ.

''అందుకేనాన్నా! పెద్దాళ్ళు చిన్నవాళ్ళతో వాదనకి దిగరాదు. దిగారో పెద్దరికాన్ని గుర్తుంచుకోరాదు''.

''ఆయనకి చాలా కోపం వచ్చేసిందిరా. మళ్ళీ మనింటికి వస్తాడో రాడో'' అంది అమ్మ.

''వారంరోజులు రాడు. తనకి కోపం వచ్చిందని మనకి తెలియడానికీ, మనలో ఎవరైనా వెళ్ళి ఆయనకి క్షమార్పణలు చెప్పడానికీ తను మనకిచ్చిన అవకాశం అనుకుంటాడు. మనం వెళ్ళకుండా ఉంటే ఆయనే వస్తాడు'' అన్నాను.

''రాడేమోరా! ముఖాన్ని గంటిపెట్టుకొని వెళ్ళిపోయాడు. మంచి మనిషి కాఫీ కూడా తీసుకోడు. ఏదో ఉబుసుపోక వస్తుంటాడు.''

''అమ్మా! కొద్దిగా వాక్చమత్కారులూ గడసరిగా మాట్లాడగలవారూ ఎప్పుడూ మూగశ్రోతలని కోరుకుంటూ ఉంటారు. ఐతే శ్రోత యే వాజమ్మో, వెట్టివెంగళాయోగాక తెలివైన వారూ, తమ గొప్పతనాన్ని గుర్తించగలవారూ వారిక్కావాలి. మీరు ఆయనకి అలా దొరికారు. హోటల్‌కి వెడితే పది కప్పుల కాఫీ ఐనా దొరుకుతుంది. కానీ ఎంత డబ్బిచ్చినా మీ వంటి మంచి శ్రోతలు దొరకరు. ఏదో సాకుతో ఆయన మళ్ళీ వస్తాడు. చూస్తూండు'' నవ్వుతూ చెప్పాను.

సరిగ్గా వారంరోజులకి వచ్చిన ఆయన ''చూడబ్బాయ్! మీ నాన్నని చూడకుండా ఉండలేకపోయాను. అందుకే నువ్వన్న మాటల్ని దులపరించుకొని మళ్ళీ మీ ఇంటికి వచ్చేశాను'' అన్నాడు. కొంతమందికి విషయాన్ని ఎక్కడ, ఎందుకు మొదలెట్టాలో తెలీదుగానీ ముగింపు ఎక్కడ ఇవ్వాలో ఖచ్చితంగా తెలిసుంటుంది. ఆయన అలాంటి వాడే. కనుక మళ్ళీ నా పెళ్ళి విషయం ఎత్తలేదు. కాని అమ్మ మొదలెట్టింది. ''నువ్వు పెళ్ళి చేసుకోకపోతే నేనెందుకు బ్రతకాలి''అని.

''నా పెళ్ళికీ నీ ఆయువుకీ సంబంధం ఏంటమ్మా?'' ఆమెని విసుక్కుంటూ ప్రశ్నించాను.

''చాలామంది. నా పదో ఏటినుండి నాకు బుజ్జిబుజ్జి పిల్లల్ని ఎత్తుకోవాలని ఆడించాలనీ, అక్కడిక్కడ తిప్పాలనీ ఉండేది. అమ్మానాన్నలకి ఒక్కదాన్ని గనుక తమ్ముళ్ళు, చెల్లెళ్ళని ఎత్తుకోలేకపోయాను. నువ్వు పుట్టాక కూడా నా కోరిక తీరలేదు. మీ నానమ్మ నిన్ను నా దగ్గరకు చేరనిచ్చేది కాదు. రాత్రుళ్ళు కూడా నువ్వు ఆమె దగ్గరే. నీకు పదేళ్ళు వచ్చాక ఆమె పోయింది. మాకు మరో సంతానం కలగనూ లేదు.

'నీ పిల్లల్ని ఎత్తుకుందామనుకున్నాను. నువ్వేమో పెళ్ళే వద్దంటున్నావ్. ఇక మృత్యువు వస్తే యుద్ధానికి దిగక లొంగిపోతాను'' అంది.

''నీ ఆయువుకేం లోటు లేదు. మరో పాతికేళ్ళు బ్రతుకుతావు. దిగులు మాని పడుకోమ్మా'' అన్నాను. కానీ అదే రోజు రాత్రి నిద్రలో పోయింది అమ్మ. నాన్న నన్ను పల్లెత్తు మాటకూడా అనలేదు. ఆమె దినకర్మలు ముగిసిన మర్నాడే ఆమెని వెదుక్కుంటూ వెళ్ళిపోయారు.

అంతే! నా చుట్టూ చీకటి. ఆ చీకట్లో ఎంతకాలం ఉన్నానో తెలీదు. దుఃఖానికి అతీతంగానూ, బాధకి అనాగతంగానూ ఉండిపోయాను. అలా ఇల్లూ, ఒళ్ళూ తెలీకుండా పడున్న వేళ వచ్చాడు శివ. బెంబేలు పడిపోయాడు. తిట్టాడు. ప్రక్షాళనా కార్యక్రమాన్ని ముందు ఇంటితో మొదలుపెట్టాడు. దగ్గరుండి స్నానం చేయించాడు. మంచి తిండి పెట్టాడు. అప్పుడొచ్చింది నాకు దుఃఖం. ఓదార్చాడు. ''ట్రైనింగ్‌కని ఢిల్లీ వెళ్ళాను. రాగానే నీ విషయం తెలిసి పరుగెత్తుకు వచ్చాను. ఇపుడు నీకు కావల్సింది మనశ్శాంతి. అది ఎక్కడ దొరుకుతుందో చూపుతాను పద''అంటూ ప్రయాణం కట్టించాడు. 'ఎక్కడికో' గ్రహించలేని అమాయకుడిని కాను. మౌనంగా వెంబడించాను.

ఆటో ఆగాక ఓ యింటి తలుపు తట్టాడు. ఇద్దరం ఇంట్లోకి వెళ్ళాం. కాస్సేపు పిచ్చాపాటి తరువాత ''వాణీ! మావాడి మనసుని ప్రక్షాళన చేసి వదులు. నేను మళ్ళీ వస్తాను'' అంటూ వెళ్ళాడు. తల వంచుకొని నేను. ''ఏమయింది మీ మనస్సుకి?'' అడిగింది. నేను పలుకలేదు. కొద్ది క్షణాలాగి ''మగవాడు తల వంచుకునేది ఎప్పుడో చెప్పండి'' అంది.

వెంటనే నేను తలెత్తి ఆమె వంక చూశాను. నల్లగా, లావుగా, నోట్లో కిళ్ళీతో మొరటుగా ఉండే నేనూహించిన ''ఆమె''అందంగా, సన్నగా, తెల్ల చీరా, రవికా, పొడవాటి జడతో ఊహించని 'ఈమె'. ''నే కాఫీ తెస్తాను. ఈలోగా ఆలోచించి జవాబు చెప్పండి''అంటూ వెళ్ళి కప్పుతో వచ్చింది. ''ఏమయింది మీ మనసుకి'' అడిగింది.

''అమ్మానాన్నా పోయారు'' చెప్పాను. ''పెళ్ళి చేసుకోనన్నారా ఏంటి'' అడిగింది. నేను ఉలిక్కిపడి ''మీకెలా తెలుసు?'' అడిగాను. ''మధ్యతరగతివాడు పెళ్ళివద్దంటేనూ, గొప్పింటి బిడ్డ ప్రేమించానంటేనూ సమస్యలు వస్తాయి. పెళ్ళెందుకు వద్దనుకున్నారు?'' అడిగింది.

''నాకు...నాకు ఓ లక్ష్యం ఉంది''. నా జవాబుకి ఆమె ఉలిక్కిపడింది. ''ఏమిటా లక్ష్యం?'' అడిగింది ''సినీ దర్శకుడిని కావాలని...'' చెప్పాను. ''దర్శకులంతా పెళ్ళి మానడంలేదే?'' అంది. ''తెలిసే అడుగుతున్నారా?'' నా ప్రశ్నకి ''తెలుసుకోవాలని అడుగుతున్నాను'' అంది. ''ఐతే వినండి. గోదావరి ఒడ్డున ఇల్లు కట్టుకున్న వాడికీ. ఎడారిలో ప్రయాణం చేసే వాడికీ దాహం ఒక్కటే. తపనలో తేడా ఉంటుంది.''

కొద్దిసేపు మాట్లాడలేదామె. తరువాత ''సాధారణంగా సినీ దర్శకులంతా టోపీలు పెట్టుకుంటారు ఎందుకు?'' అడిగింది. ''ఎండ తగలకుండా'' చెప్పాను.

''మరే నిర్మాతకి, హీరో హీరోయిన్లకి, నటీనటులకి, ఎవ్వరికీ లేని ఎండ ఒక్క దర్శకుడికేనా?'' అంటూ ఎద్దేవా చేసింది. ''అదీ నిజమే. కారణం నాకు తెలీదు''చెప్పాను. ''మీరు చాలా బుద్ధిమంతుడు'' అంది.

''ఏం అలా అన్నారు?'' అడిగాను. ''బుద్ధిమంతుడు కానివారు తనకి తెలీని విషయాన్నింత రకీమని ఒప్పుకోరు'' చెప్పింది. కాస్సేపుండి ఇంటికి వచ్చాను. మర్నాడు శివ వచ్చి తను ఢిల్లీకి వెళ్తున్నాననీ, అట్నుండటు స్టేట్స్‌కి వెళ్తాననీ నన్ను కనిపెట్టి ఉండమనీ వాణికి చెప్పి వెళ్ళిపోయాడు.

మర్నాడు వెళ్ళాను. ''రండి''అంటూ సాదరంగా ఆహ్వానించింది.

''ఎలా ఉంది మీ మనస్సు?''అడిగింది. ''ఫరవాలేదు'' నవ్వాను.

''ఇప్పుడు చెప్పండి మీ గురించిన వివరాలు.''

''చెప్పేందుకు ఏముంది? అమ్మా, నాన్నా నేను. వారుపోయారు. నేను మిగిలాను.''

అలా చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాం. భోజనం కూడా అక్కడే కానిచ్చాను. ఆమెకి థాంక్స్ చెప్పి బైటికి

సి.హెచ్.సీత



ఇంటి వైద్యం

★ సదాపిపత్తులు (శత పుష్పా)ను పాలతో నూరి పై పూతగా రాసిన వాత రకమునందు ఉపయుక్తంగా ఉండును.

వచ్చాక గుర్తొచ్చి అడిగాను. "మీ ప్రశ్నలకి మీరే జవాబు చెప్పాలి."

"ఏం ప్రశ్నలు?"

"దర్శకులు టోపీ పెట్టుకోవడం, మగాడు తలవంచుకోవడం..."

"బుర్రలోని ఆలోచనలు ఆవిరైపోకుండా దర్శకులు టోపీలు పెడతారు. ఎదుటివారు తనని బుద్ధిమంతులు అనుకోవాలనుకున్నప్పుడు మగాడు తల వంచుకుంటాడు." పకపక నవ్విందామె. టార్చివేసి నేలపై వెదుకుతున్నాను. "ఏమిటి వెదుకుతున్నారు?" అడిగింది.

"రత్నాలు... ఇందాక మీరు నవ్వినప్పుడు రాలాయేమోనని..." సీరియస్‌గా చెప్పి బైటపడ్డాను.

* * *

నాలుగురోజులకి మళ్ళీ వెళ్ళాను. త్రోవలో ఆమె ఎదురైంది. ఆఫీసునుండి వస్తున్న మహిళ అవతారంలో, "రండి" అంది ఇంటికి దారితీస్తూ. "ఏంటలా మౌనంగా ఉన్నారు?" అడిగింది "ఉద్యోగం చేస్తున్నారా?" అడిగాను. "ఔను"అంది కాఫీ కప్పు అందిస్తూ.

"మరిలాంటి పనులేంటి" కొంచెం కోపంగానే అడిగాను. "ఎలాంటి పనులు?" రెట్టించింది. మౌనమే నా భాష. "అనాథ శరణాలయంలో పెరిగాను. కష్టపడి చదివాను. మంచి ఉద్యోగం వచ్చింది. చిన్న గది అద్దెకి తీసుకుని ఉన్నాను. నా గురించిన వివరాలు అడిగితే మామూలుగానే చెప్పాను. ఇల్లుగలాయన నామీద చేయి వేశాడు ఓరోజు. అంతే! ఆ చేతి మీద వాతలు పెట్టాను. ఇల్లు మారాను. ఎక్కడికి వెళితే ఏముంది? అక్కడ ఇరవై ఏళ్ళవాడు అరవై, అరవై ఏళ్ళ తాత ఇరవై ఇస్తానని బేరం పెట్టారు. దీనికితోడు ఆడవాళ్ళ పుల్లవిరుపు మాటలు.

ఈ దేశంలో ఆడవాళ్ళకి రాని రెండు ముఖ్యమైన పనులేంటో తెలుసా? ఒకటి మొగుణ్ణి ఆకర్షించడం, రెండు మొగుణ్ణి వదిలేయడం. అప్పుడు ఇక్కడికి వచ్చాను. సౌంజ్ఞలుచేసిన మగాళ్ళిప్పుడు బెదురుచూపులు చూస్తున్నారు. అసహ్యించుకున్న ఆడాళ్ళు యిపుడు భయపడుతున్నారు. మీ సభ్య సమాజపు ముసుగులో నన్ను గురించిన యుద్ధం ఆరంభమయింది, నాకు సంతోషంగా ఉంది. నన్ను చూసి భయపడే వాళ్ళున్నందుకు".

"మరి మరి మీరు పెళ్ళిచేసుకోవల్సింది..."

"ఎవర్ని చేసుకోను? మగాళ్ళందరికీ నేనంపుడు కత్తిలానే నచ్చాను. భార్యగా కాదు"

"పోనీ... నా ఆశయాల్ని పక్కకి నెట్టి ఈమెని పెళ్ళాడితే?"

"ఏంటీ? మీ ఆశయాన్ని పక్కకి నెట్టి నన్ను పెళ్ళాడాలనుకుంటున్నారా? మాతాపితరుల హంతకులౌతారు. జాగ్రత్త!" నవ్విందామె.

"నా మనసులో మాట మీకెలా తెల్సింది?"

"మీరు బుద్ధిమంతుడే కాదు. మంచివారు కూడా. మంచివారు లక్ష్యం మరువకూడదు, ఆc!విషయం మధ్యలో ఆగింది. వినండి. 'ఇక్కడ' ఉండటం నాకూ బాధగానే ఉంది. మీ జనారణ్యంలో నాకోసం చిన్న కుటీరం వేసుకోగల్గినప్పుడు తప్పక ఈచోటుని విడుస్తాను. అంతేగాని ఇక్కడ ఉండి నేను 'తప్పులు'చేయడం లేదు. 'తప్పు'చేయాలనుకుంటే ఇక్కడ ఉండనక్కర్లేదు. శివ నా ఆప్తమిత్రుడు. అతడే నాకీ సలహా ఇచ్చి, ఇక్కడ తెచ్చిపెట్టాడు."

"మరి మీ భర్త? ఎలా పోయారు?"

"అది రహస్యం ఇపుడు చెప్పను. ఆc! ఏమయింది మీ దర్శకత్వం?" ఆ మాటలకి నేను పలుకు నాస్తిగా ఉండిపోయాను. "నాకు తెలిసిన ఓ దర్శక నిర్మాత ఉన్నారు. ఆయన దగ్గర గొడుగు పట్టే ఉద్యోగం ఉందిట. వెళ్తారా?" అడిగింది. తలూపాను. ఇల్లు అమ్మి ఆ డబ్బుతో సినిమా బండి ఎక్కాను.

* * *

అలా మొదలైన సినీ జీవితం నేడు ఎ-1 దర్శకుడిని చేసింది. పద్దెనిమిది ఏళ్ళ క్రితం నేనెవరో ఎవరికీ తెలీదు. నేడు తెర మీద దర్శకుడిగా నాపేరే జనాలని థియేటర్లకి రప్పిస్తున్నది. మధ్యలో ఓసారి వాణిని చూడడానికి వెళ్ళాను. కాని ఆ ఇళ్ళన్నీ కూల్చి అపార్ట్‌మెంట్స్ కట్టారు.

* * *

ఆరోజు ఉదయంనుండి మనసు అదోలా ఉంది. షూటింగ్ కాన్సిల్ చేసి యింటికి వచ్చాను. చాలామంది నన్ను పెళ్ళిచేసుకోమని సలహాఇచ్చారు. వాళ్ళ మాటల్ని త్రోసిపుచ్చాను గానీ సినీ దర్శకుడిగా అంతర్జాతీయ అవార్డు అందుకోవాలనుందని అనలేదు ఎక్కడా.



మీరు బుద్ధిమంతుడే కాదు. మంచివారు కూడా. మంచివారు లక్ష్యం మరువకూడదు. ఆc!విషయం మధ్యలో ఆగింది. వినండి. 'ఇక్కడ' ఉండటం నాకూ బాధగానే ఉంది. మీ జనారణ్యంలో నాకోసం చిన్న కుటీరం వేసుకోగల్గినప్పుడు తప్పక ఈచోటుని విడుస్తాను.

పి.ఎ. లెటర్స్ ముందుపెట్టాడు. చివరగా మిగిలిన ఓ ఉత్తరం చెత్తబుట్టలోకి విసురుతూ "పదేళ్ళ క్రితం వేసిన గృహప్రవేశ ఆహ్వానం... పోస్టల్ వారి నిజాయితీకి చిహ్నంగా నేడు చేరింది" అన్నాడు "పేరు?"... అడిగాను. "వాణిట". అతని మాట పూర్తికాకుండానే ఒక్క అంగలో చెత్తబుట్టని చేరాను. శుభలేఖ చేతిలోకి తీసుకున్నాను.

ఆనందమో, దుఃఖమో తెలీని కన్నీళ్ళు శుభలేఖమీద టపటప రాలుతున్నాయి. 'పి.ఎ.' విస్తుపోయాడు. ముభావంగా, సీరియస్‌గా ఉండే నేను ఇలా ఉండడం అతనికి కొత్త. అడ్రస్ చూసి 'హైదరాబాద్...ఈ ఊరే' అనుకొని వారందాకా షూటింగ్స్, కాల్స్, అన్నీ కాన్సిల్ చేయమని పి.ఎ.కి చెప్పి కార్లో బయలుదేరాను.

* * *

కాలింగ్ బెల్ నొక్కాను. ఆమే వచ్చి తలుపు తీసింది. "మీరా?" అంది ఆనందంగా ఆమె కాస్త ఆవిడలా మారింది. చెంపలు నెరిశాయి. రంగు తగ్గింది. ఒళ్ళు వచ్చింది. చత్వారపు అద్దాలు వచ్చాయి. అది కాదు నే చూస్తున్నది. బొట్టూ, పూలు, గాజులు మెడలో బంగారు తాడు... ఇప్పుడే బాగుందామె.

"అలా ఆశ్చర్యంగా చూడ్డమేనా లోపలికి వచ్చేదేమైనా ఉందా?" ఆమె మాటలకి ఇంట్లోకి నడిచాను. మూడురోజులున్నాను. ఆమెతో కబుర్లతో కాలం తెలియలేదు. మరో రెండు రోజులుండాలనుంది. కాని ఏదో అసంతృప్తి.

"ఈ రోజునే వెళ్తాను. కాని మీ వారిని కలిసి, మీ పెళ్ళి వివరాలు తెల్సుకుని ఆ అదృష్టవంతుణ్ణి అభినందించి..." నా గొంతు అదోలా.

"ఓ... అందుకా ఈ మూడు రోజులూ బిగుసుకుపోయి కూర్చున్నారు? సరే. నాతో రండి. మా 'వారిని చూపుతాను"అంటూ బైటికి నడిచింది. అనుసరించాను. కారులో పది నిముషాలు ప్రయాణించాం. ఆమే డ్రైవింగ్ చేసింది. కారు ఓ పెద్ద భవంతి కాంపౌండ్ వాల్ ముందు ఆగింది. "అదిగో నా భర్త"అంది ఓ పెద్ద బోర్డ్ వంక చూపుతూ. అది చూసి కళ్ళు తిరిగినట్టయింది నాకు. మౌనంగా వెళ్ళి కార్లో కూర్చున్నాను. ఆ రాత్రి నాకు నిద్ర లేదు.

* * *

'రక్షణ' ఇదో సామాజిక సేవా సంస్థ పేరు. ఆడవారు... అందునా వ్యభిచారులుగా దిగజార్చబడినవారూ, అనాథలు, శరణార్థులకి కంచుకోట ఆ చోటు. మీడియాకి, ప్రచార సాధనాలకి దూరంగా ఉండే వ్యవస్థాపకురాలు జనాలకి దూరంగా ఉంటుంది. అక్కడ ఉన్న స్త్రీలని తలెత్తి చూసే ధైర్యం ఏ మగాడికీ లేదు.

విద్య, వ్యాపారం, వ్యవసాయం, కంప్యూటర్ల శిక్షణ అంతా అక్కడ. ఉద్యోగాలు కూడా అక్కడే. 'వే'అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆ సంస్థ వారిదే. జాతీయ, అంతర్జాతీయ అవార్డులెన్నో పొందిన వ్యవస్థాపకురాలు ఎప్పుడూ తెరమీద కనిపించలేదు. మీడియావారు పట్టుబట్టి ఒకేసారి ఆమె ఇంటర్వ్యూ తీసుకుంటే ఉత్తర భారతీయ వనితలా ముఖమంతా కొంగు కప్పుకు వచ్చింది. తన ముఖమంతా కాలిపోయిందనీ, కాళ్ళూచేతులు కూడా వికారంగా ఉన్నందున తానెవరికీ కనిపించనని చెప్పింది. ఏ పని వారు కూడా తన ముఖం ఇంతవరకు చూడలేదని చెప్పింది.

ఆమె...ఆమె...ఈ వాణి. "ఎందుకు కనిపించవు... ఐమీన్ జనాలకి?" అడిగాను-మర్నాడు. "అనవసరం అనిపించింది." అందామె. "నీ లక్ష్యంముందు నా లక్ష్యం చిన్నది. నన్ను పెళ్ళిచేసుకొని ఉంటే నీకు చాలా సాయపడేవాడిని గదా?"

"సరే! మీకిప్పుడు నిజం చెబుతా వినండి. నా లక్ష్యానికి పెళ్ళి అడ్డం కాదు. మొగుడు అడ్డం. అభాగ్యులైన అంత మంది స్త్రీలని చూస్తే ఎవడికైనా కలుగుతుంది రిమ్మ తెగులు. అలాంటిది నా భర్త స్థానంలో ఉంటే?... కీచకులు ఆడవాళ్ళని చూశాకనే పుడతారు. కొత్త కీచకుడిని తయారుచేయడం నాకిష్టం లేదు."

"నేను కూడా..." కొద్దిగా నొచ్చుకుని అడిగాను.

"మీరు మంచివారు. కాని మారని వారని గ్యారంటీ లేదు. అందుకే నమ్మలేదు."

ఆమె మాటలు నన్ను బాధించాయి. కాని నచ్చాయి. పది రోజులు ఆమెతో కబుర్లు చెబుతూ అక్కడే ఉండిపోయాను. తిరుగు ప్రయాణంలో కార్లో వస్తున్నాను.

ఆమెకీ లక్ష్యం ఉంది. నాకూ ఉంది. నాది స్వార్థం. ఆమెది ఉపకారార్థం. లక్ష్యానికి పెళ్ళి అడ్డనుకున్న నేను. పెళ్ళి ఫలితాలే తనకి అవరోధం అనుకుందామె. విలక్షణమైన బాటవేసుకుంది గనక కోరకుండానే అవార్డులు, రివార్డులు. నాకు...? గొప్పవాడినన్న అహం. అందుకే రెండుసార్లు 'ఆస్కార్'మిస్సయ్యాను దీక్షగా శూన్యంలోకి చూస్తూ 'సాధించాలి' అనుకున్నాను. ★

రచయిత్రి చిరునామా:
- సిహెచ్.సీత,
ప్లాట్ నెం.137, ఇంటి నెం.8-282,
హెచ్.ఎం.టి.రోడ్, చింతల్ (పోస్ట్)
స్వామివివేకానందనగర్ కాలనీ,
హైదరాబాద్.



ఇంటి వైద్యం
★ పంచతిక్త ఘృత గుగ్గులు పది మి.లీ. ఉదయం-సాయంత్రం సేవిస్తే వాత రక్త దోషాలు తగ్గుతాయి.